నమస్తే తెలంగాణ
సూర్యాపేట
I | నల్లగొండ, గురువారం 15 మే 2025 | SURYAPET

అంతర్జాతీయ బేస్‌బాల్ పోటీలకు పలివెల యువకుడు

శివకుమార్

మిర్యాలగూడ, మే 14: ఈ నెల 15 నుంచి 21 వరకు ఇరాన్‌లో జరిగే బేస్‌బాల్ వెస్ట్ ఏసియా కప్ ఇంటర్నేషనల్ టోర్నమెంట్‌కు మునుగోడు మండలం పలివెల గ్రామానికి చెందిన గుత్తి శివకుమార్ భారత జట్టు తరపున ఆడేందుకు ఎంపికైనట్లు బేస్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ చిర్ర మల్లేశ్ తెలిపారు. బుధవారం మిర్యాలగూడలో విలేకరులతో మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన శివకుమార్‌కు బేస్‌బాల్ క్రీడ పట్ల ఉన్న ఆసక్తిని గమనించి తాను జిల్లా కేంద్రంలో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అంతర్జాతీయ బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన శివకుమార్‌ను అమరావతి సైదులు, పాశం నరసింహారెడ్డి, ఉస్మాన్ షేక్, పరమేశ్, శంకర్, మౌనిక, మహేష్, స్వామి, పవన్, రవి అభినందించారు.

గౌరారంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

ధాన్యాన్ని కొనే దిక్కు లేదు

- కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి వేచిచూసే పరిస్థితి
- రైతుల ఉసురుపోసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్

డిండి, మే14 : ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనే దిక్కులేదని, కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి వేచిచూసే పరిస్థితి దాపురించిందని బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. డిండి మండలంలోని టి.గౌరారం, తవక్లాపూర్, డిండి, గోనబోయినపల్లి గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. రైతులకు పంట పెట్టుబడి సాయం అందించడంలో, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటా వేయడంలో, ధాన్యాన్ని తరలించడంలో, అమ్మిన తర్వాత రైతుల ఖాతాల్లో డబ్బులు వేయడంలో ప్రభుత్వం జాప్యం చేస్తున్నదని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తరుగు పేరిట బస్తాకు మూడు కేజీల వడ్లు కట్ చేస్తున్నారని, వెంటనే ఈ విధానాన్ని ఆపాలని కోరారు. దేశానికి అన్నం పెట్టే రైతుల కష్టం తీర్చడానికి ముఖ్యమంత్రికి సమయం లేక పోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శ్రద్ధ తీసుకొని గన్నీ బ్యాగులు సరిపడా సరఫరా చేయాలని, తగినన్ని లారీలని ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోళ్లను వేగంగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రాజినేని వెంకటేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రావు, జనార్దన్‌రావు, రాఘవాచారి, గొడుగు వెంకటయ్య, శీమర్ల మల్లయ్య, రవీందర్‌రావు, కృష్ణయ్య, వెంకట్‌రామ్, గిరమోని శ్రీను, పెద్దులు, చంద్రయ్య, జయంత్, సురేశ్, తండు శ్రీను, బాసిత్, పీర్ మహ్మద్, ఐలేశ్‌చారి, రేణయ్య, రషీద్ పాల్గొన్నారు.

అందాల తారలు దిగివచ్చే వేళ..

యాదగిరిగుట్టలో దర్శనం.. అద్భుత శిల్పకళ వీక్షణం
పోచంపల్లిలో వస్త్రాల తయారీ విధానం పరిశీలన
ఇక్కత్ ప్రాముఖ్యత, గ్రామీణ సంస్కృతి చాటి చెప్పేలా..
అన్ని ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగం
పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు

నేడు యాదాద్రిలో ఆఫ్రికా, కరేబియన్ భామల పర్యటన

వివిధ దేశాల అందాల తారలు యాదాద్రి భువనగిరి జిల్లాలో పర్యటించనున్నారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, ప్రముఖ పర్యాటక ప్రాంతమైన భూదాన్‌పోచంపల్లిలో సందడి చేయనున్నారు. ఈ మేరకు రెండు చోట్లా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఏర్పాట్లను కలెక్టర్ హనుమంతరావు పర్యవేక్షించారు. మిస్ వరల్డ్ పోటీదారులు ప్రత్యేక బస్సుల్లో రానున్నారు. యాదగిరిగుట్టలో దర్శనం చేసుకోవడంతోపాటు అబ్బురపరిచే ఆలయ శిల్పకళను వీక్షించనున్నారు. పోచంపల్లిలో చేనేత ప్రాముఖ్యతను తెలిపేలా ఏర్పాట్లు చేశారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

–యాదాద్రి భువనగిరి, మే 14 (నమస్తే తెలంగాణ)

మిస్ వరల్డ్ పోటీ దారుల పర్యటన కోసం పోచంపల్లిలో విద్యుద్దీపాల వెలుగులో టూరిజం పార్క్

ప్రపంచ అందాల పోటీలు హైదరాబాద్‌లో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి తెలియజేయడానికి ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శించేందుకు ఏర్పాట్లు చేసింది. ఈ నేపథ్యంలో గురువారం జిల్లాలోని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, భూదాన్ పోచంపల్లికి 35మంది వరకు అందగత్తెలు రానున్నారు. యాదగిరిగుట్టలో కరేబియన్ దీవులకు చెందిన సుమారు 10మంది అందగత్తెలు 1.40గంటలపాటు గడపనున్నారు. సాయంత్రం 5గంటలకు గుట్టకు చేరుకుంటారు. అక్కడి నుంచి అతిథి గృహానికి వెళ్తారు. అక్కడి నుంచి కొండపై అఖండ దీపారాధన చేస్తారు. కోలాటం, భజనలు, సంప్రదాయ నృత్యాలతో వారికి ఘన స్వాగతం పలుకుతారు. అక్కడే స్వర్ణ విమాన గోపురం కనిపించేలా ఫొటోలు దిగనున్నారు. అక్కడి నుంచి తూర్పు రాజగోపురం నుంచి ప్రధానలయంలోకి వెళ్తారు. వారికి ఆలయ అర్చకులు వేదాశీర్వచనం ఇస్తారు. అనంతరం పడమర రాజగోపురం నుంచి బయటకు వస్తారు. స్వామివారి ప్రసాదం, చిత్రపటాలను అందజేస్తారు. ఈ సందర్భంగా ఆలయ వైభవం, కట్టడాలను పరిశీలించనున్నారు. పర్యటన ముగింపుతో తిరిగి హైదరాబాద్‌కు వెళ్లిపోనున్నారు. సుందరీమణుల పర్యటన సందర్భంగా సాయంత్రం బ్రేక్ దర్శనాలతోపాటు జోడు సేవను నిలిపివేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

యాదగిరి గుట్టలో టూర్ ఇలా..
విద్యుత్ వెలుగుల్లో యాదగిరిగుట్ట ఆలయ స్వాగత తోరణం

పోచంపల్లిలో చేనేత ప్రాముఖ్యతను తెలిపేలా..

పోచంపల్లికి ఆఫ్రికా ఖండానికి చెందిన 25మంది తారలు విచ్చేయనున్నారు. సాయంత్రం ఆరు గంటలకు మిస్ వరల్డ్ పోటీదారులు పోచంపల్లికి చేరుకుంటారు. రెండు బ్యాచ్‌లుగా చేరుకొని వేర్వేరుగా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ముందుగా వారికి కోలాటాలతో ఘన స్వాగతం పలుకుతూ బొట్టు పెట్టి శాలువా పూలమాలలో సత్కరిస్తారు. పోచంపల్లి రూరల్ టూరిజం సెంటర్ లోపల ద్వారం వద్ద ముగ్గులతో అందంగా అలంకరించిన టెర్రకోట్ కుండలను పరిశీలిస్తారు. లోపల గచ్చు ప్రాంతంలో మెహందీ వేయడాన్ని తిలకిస్తారు. లైవ్ మ్యూజికల్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మ్యూజియం లోపల ఏర్పాటు చేసిన చేనేత మగ్గాలపై చేనేత వస్త్రాల తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా తిలకించి.. దారం వడకడం నుంచి వస్త్రాల తయారీ వరకు ప్రాసెసింగ్ విధానాన్ని వివరిస్తారు. టూరిజం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎడ్ల బండిని తిలకిస్తారు. తెలంగాణ సంప్రదాయానికి ప్రతీకగా నిలిచిన బతుకమ్మను పేర్చుతూ పాటలు పాడుతారు. అక్కడి నుంచి యాంపీ థియేటర్ వద్దకు చేరుకొని వీఐపీలతో పాటు సుందరీమణులు సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షిస్తారు. ఫ్యాషన్ డిజైనర్ స్వాతి రూపొందించిన ఇండో–వెస్టన్ ఇక్కత్ వస్త్రాలతో మోడల్స్ నిర్వహించే ర్యాంప్ వాక్‌ను చూస్తారు. పోచంపల్లి ఇక్కత్ ప్రాముఖ్యతపై ప్రదర్శనను తిలకిస్తారు. ప్రాంగణంలో గుడిసెల సెట్‌లో చేనేత స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఏడు పోచంపల్లి ఇక్కత్ స్టాల్స్, గద్వాల, సిద్దపేట, గొల్ల భామ, నారాయణపేటకు ఒక్కో స్టాల్‌ను ఏర్పాటు చేశారు. మ్యూజియంలో లైవ్ డెమోనిస్ట్రేషన్‌లో మగ్గంపై వస్త్ర తయారీని పరిశీలిస్తారు.

పటిష్ట పోలీస్ బందోబస్తు..

సుందరీమణుల పర్యటన నేపథ్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. టూర్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షించనున్నారు. వీటిని స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి నేరుగా హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. మూడంచెల భద్రతలో పర్యటన కొనసాగనుంది. అందగత్తెల వెంట మహిళా పోలీసులు ఉండనున్నారు. ఒక్కొక్కరికి ఒక్కో మహిళా పోలీసును నియమించారు. వారు వచ్చినప్పటి నుంచి పోయే వరకు వారి వెంటే ఉండనున్నారు. టూర్ నేపథ్యంలో సుమారు 500 మంది పోలీసులు విధులు నిర్వహించనున్నారు.

నీలగిరి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలోని పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి, సీఓఈ ఉపేందర్‌రెడ్డి

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు షురూ

దేవరకొండలో ఒక విద్యార్థి డిబార్

రామగిరి, మే 14 : మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా బుధవారం డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలో 36 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. తొలి రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 6వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్.. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 1వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు జరిగాయి. ఉదయం జరిగిన 6వ సెమిస్టర్‌కు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 6,007మంది విద్యార్థులకు 5,689మంది హాజరయ్యారు. 317మంది గైర్హాజరయ్యారు. దేవరకొండలోని ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థి మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతుండగా ఆ పరీక్ష కేంద్రం స్క్వాడ్ డిబార్ చేశారు. మధ్యాహ్నం జరిగిన సెమిస్టర్ 1 బ్యాక్‌లాగ్ పరీక్షకు 1,176మందికి 1,015మంది హాజరయ్యారు. 161మంది గైర్హాజరయ్యారు. నల్లగొండలోని పలు పరీక్ష కేంద్రాలను ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి, సీఓఈ జి.ఉపేందర్‌రెడ్డి, అసిస్టెంట్ పరీక్షల నియంత్రణాధికారి లక్ష్మీప్రభ పర్యవేక్షించారు.

నిధులు రాక నిర్వహణ భారమవుతున్నది

- పంచాయతీలకు 14 నెలలుగా ప్రభుత్వం నయా పైసా ఇవ్వలేదు
- అప్పులు చేసి అభివృద్ధి పనులకు వెచ్చించినం
- ఆత్మకూర్.ఎం గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆవేదన

మాట్లాడుతున్న ఆత్మకూర్.ఎం గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌కుమార్

ఆత్మకూరు(ఎం), మే14 : రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వకపోవడంతో నిర్వహణ భారమవుతున్నదని, అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేస్తున్నామని ఆత్మకూరు(ఎం) గ్రామ పంచాయతీ కార్యదర్శి తుమ్మల ఆనంద్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ 14నెలల నుంచి గ్రామ అభివృద్ధి కోసం ప్రభుత్వం నయా పైసా కూడా ఇవ్వలేదని అన్నారు. గ్రామ అభివృద్ధి పనుల కోసం తాను స్వయంగా అప్పు చేసి రూ.9లక్షలు ఖర్చు చేశానని తెలిపారు. ఆత్మకూరు(ఎం)లో 1400 ఇండ్లు, 5,300 మంది జనాభా ఉన్నారని చెప్పారు. పంచాయతీలో నిధులు లేకపోవడంతో మండల స్థాయి అధికారుల ఆదేశాల మేరకు అప్పుచేసి తెచ్చిన డబ్బులతో గ్రామంలో పైపు లైన్, పరిశుభ్రత పనులు, చెత్త సేకరణ ట్రాక్టర్ కోసం డీజిల్, వీధిలైట్లు, ఇతర అవసరాల కోసం ఖర్చు చేశామని తెలిపారు. ఆర్థిక భారంతోపాటు పనిభారం ఎక్కువ కావడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ప్రభుత్వం ఇప్పటికైనా గ్రామ పంచాయతీకి నిధులు విడుదల చేయాలని, తాను సొంతంగా ఖర్చు చేసిన డబ్బులు కూడా ఇవ్వాలని కోరారు.

యువతిపై హత్యాయత్నం కేసులో నిందితుడికి జైలు

రామగిరి, మే 14: యువతిని ప్రేమ పేరుతో వేధించడంతో పాటు ఆమెపై హత్యాయత్నం చేసిన వ్యక్తికి జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తూ బుధవారం నల్లగొండ ఫ్యామిలీ కోర్టు మూడవ అదనపు న్యాయమూర్తి డి.దుర్గాప్రసాద్ తీర్పు వెల్లడించారు. కేసు వివరాలు .. నల్లగొండ మండలం కాకుల కొండరాం గ్రామానికి చెందిన యువతికి మేళ్లదుప్పలపల్లి గ్రామానికి చెందిన మనిమిద్దె సాయిరాంతో ఓ ఫంక్షన్‌లో పరిచయం ఏర్పడింది. సదరు యువతిని ప్రేమిస్తున్నానంటూ సాయిరాం చెప్పగా అందుకు ఆమె నిరాకరించింది. అయినా సదరు యువకుడు వినకుండా తనను ప్రేమించాలంటూ వేధింపులకు గురి చేశాడు. ఆగస్టు8, 2024న నల్లగొండ మండలం కంచనపల్లి జడ్పీహైస్కూల్ వద్ద వ్యక్తిగత పని కోసం వెళ్లిన యువతిపై సాయిరాం హత్యాయత్నం చేశాడు. ఈ ఘటనపై బాధితురాలు నల్లగొండ రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ సైదాబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపటారు. ఈ నేరానికి సహకరించిన నందినిపై కూడా కేసు నమోదు అయినప్పటికీ ఆమెను కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. కేసును విచారించిన న్యాయమూర్తి నిందితుడిపై నేరం రుజువు కావడంతో మూడు వేర్వేరు సెక్షన్ల కింద సాయిరాంకు ఏడున్నర ఏండ్ల జైలు శిక్షతో పాటు రూ. 8వేల జరిమానా విధించారు. శిక్షను తక్షణమే అమలు చేయాలని న్యాయమూర్తి వెల్లడించారు. ఈ కేసు విచారణలో నిందితురాలికి న్యాయం జరిగేలా వాదించిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జవహర్‌లాల్, దర్యాప్తు చేసిన ఎస్ఐ సైదాబాబు, టూ టౌన్ సీఐ రాఘురావు, సీడీఓ కె.దుర్గారాజు, కోర్టు లైజన అధికారులు పి.నరేందర్, ఎన్.మల్లికార్జున్‌ను ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించారు.

నిబంధనలు పాటించని ప్రైవేట్ దవాఖానలపై చర్యలు

- 12 ఆస్పత్రులకు నోటీసులు, 7 ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు
- రెండు స్కానింగ్ సెంటర్లు సీజ్ : సూర్యాపేట డీఎంహెచ్‌ఓ కోటాచలం

సూర్యాపేట, మే 14 : రిజిస్ట్రేషన్ లేకుండా నడుపుతున్న దవాఖానలపై, నకిలీ వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాల మేరకు సూర్యాపేట జిల్లాలో పలు ప్రైవేట్ ఆస్పత్రులకు నోటీసులు ఇచ్చినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కోటాచలం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల ఆరోగ్యాలకు భద్రత కల్పించే బాధ్యతలో భాగంగా జిల్లాలోని అన్ని ప్రైవేట్, ల్యాబ్స్, స్కానింగ్ సెంటర్లలో జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ కింద క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం సమర్థవంతంగా అమలు చేసేందుకు మూడు ప్రత్యేక టీములను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కోదాడ డివిజన్‌లో ఒక టీమ్, సూర్యాపేట డివిజన్‌లో రెండు టీములు తనిఖీలు చేపడుతున్నాయని తెలిపారు. ఇప్పటి వరకు చేసిన తనిఖీల్లో నిబంధనలు పాటించని 12 ఆస్పత్రులకు నోటీసులు, 7 ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని చెప్పారు. రెండు స్కానింగ్ సెంటర్లు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. సూర్యాపేట డివిజన్‌లోని సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన శ్రీ సూర్య, చిన్నారి, శ్రీ భవాని, అను, రోహిణి, రాఘవేంద్ర మల్టీ స్పెషాలిటీ, సాయిరామ్, సాయిగణేశ్ మల్టీ స్పెషాలిటీ, శ్రీసాయిమారుతి, శ్రీరుద్ర, యూనిక్ రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటళ్లతో పాటు కోదాడ డివిజన్‌లో హుజూర్‌నగర్‌కు చెందిన చందన, గాంధీ, కోదాడకు చెందిన లక్ష్మీనవీన్, శ్రీ సురక్ష ఆసుపత్రులకు నోటీసులు జారీ చేశారని, సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఆపిల్ స్కానింగ్ సెంటర్, శరత్ కార్డియాక్ సెంటర్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు.

పన్నులు కాజేసిన బిల్ కలెక్టర్లపై అదనపు కలెక్టర్ ఆరా

- కలెక్టరేట్‌లో మోత్కూరు మున్సిపల్ కమిషనర్, సిబ్బందితో సమీక్ష
- వసూలైన రూ.15 లక్షలు రికవరీకి చర్యలు

మోత్కూరు, మే 14 : మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలో ప్రజల నుంచి పన్నులు వసూలు చేసి కాజేసిన బిల్ కలెక్టర్లపై అదనపు కలెక్టర్ వీరారెడ్డి ఆరా తీశారు. నమస్తే తెలంగాణ దిన పత్రికలో బుధవారం 'పన్నులు వసూలు చేసి సొంతానికి' అనేక శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మున్సిపల్ కమిషనర్ కె.సతీశ్‌కుమార్, మేనేజర్ ప్రభాకర్, ఎన్విరాల్‌మెంట్ ఇంజినీర్ శ్రవణ్, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీకాంత్‌తో సమీక్ష నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఎనిమిది మంది సిబ్బంది బిల్ కలెక్టర్లుగా పని చేస్తున్నారు. వీరిలో ముగ్గురు బిల్ కలెక్టర్లు వసూలు చేసిన పన్నులు రూ.15లక్షల పైచిలుకు ప్రభుత్వ ఖజానాకు జమ చేయకుండా సొంతానికి వాడుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ సతీశ్‌కుమార్ విచారణలో తేలింది. సొంతానికి వాడుకున్న పన్నులను గురువారం ప్రభుత్వ ఖజానాకు జమ చేయించాలని మున్సిపల్ కమిషనర్ సతీశ్‌కుమార్‌ను అదనపు కలెక్టర్ ఆదేశించారు. డబ్బులు చెల్లించని బిల్ కలెక్టర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మున్సిపాలిటీ ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు.

పుట్టగొడుగుల్లా ప్రైవేట్ పాఠశాలలు

- ప్రభుత్వ గుర్తింపు, అనుమతి లేకుండా ఏర్పాటు
- నల్లగొండ జిల్లాలో పెద్దఎత్తున నడుస్తున్న అడ్మిషన్లు
- చోద్యం చూస్తున్న విద్యాశాఖ అధికారులు
- ఇప్పటికి ఆరు పాఠశాలలకు అనుమతి లేదని డీఈఓ ప్రకటన

రామగిరి, మే 13 : నల్లగొండ జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ప్రభుత్వ గుర్తింపు, అనుమతి లేకుండా ఏర్పాటవుతున్నాయి. ఆకర్షణీయమైన బ్యానర్స్, వాల్ పోస్టర్లు వేసి పెద్ద ఎత్తున అడ్మిషన్లు తీసుకుంటున్నాయి. కానీ జిల్లా విద్యాశాఖ అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పాఠశాలలకు గుర్తింపు లేదని ప్రకటనలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పటికే జిల్లాలో ఎన్నో ప్రైవేట్ స్కూళ్లు ప్రభుత్వ గుర్తింపు లేకుండా వెలసినా బయటపడ్డవి కొన్ని మాత్రమేనని, అధికారులు తమ చేతివాటం ప్రదర్శించడంతో వెలుగులోకి రావడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. జిల్లా విద్యాశాఖ అధికారి బి. భిక్షపతి నల్లగొండ జిల్లాలో ఆరు ప్రైవేట్ స్కూళ్లకు ప్రభుత్వ గుర్తింపు లేదని, వాటిల్లో అడ్మిషన్లు చేయొద్దని ప్రకటన జారీ చేశారు.

ప్రభుత్వ అనుమతి లేని స్కూళ్లు ఇవే..

శ్రీచైతన్య(హాలియా), శ్రీచైతన్య (దేవరకొండ), జయ హైస్కూల్ (రవీంద్రనగర్, నల్లగొండ), ఎలైట్ స్కూల్ (నల్లగొండ), లిటిల్ స్కాలర్స్ హైస్కూల్ (నల్లగొండ), వేదాంత హైస్కూల్(రామగిరి, నల్లగొండ).

గుర్తింపు లేని పాఠశాలల్లో చేర్పించొద్దు : భిక్షపతి, డీఈఓ

ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలను చేర్పించేటప్పుడు తల్లిదండ్రులు ఆ పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు ఉందా లేదా అని తెలుసుకోవాలి. గుర్తింపు లేకుండా పాఠశాలలను ఏర్పాటు చేసి అడ్మిషన్లు తీసుకుంటే నిబంధనలు మేరకు కఠిన చర్యలు ఉంటాయి.

పరీక్షల్లో ఫెయిల్ అయ్యాడని ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

కోదాడ రూరల్, మే 14: ఇంజినీరింగ్ ఫస్టియర్ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురై ఓ విద్యార్థి బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గుడిబండ గ్రామానికి చెందిన కీర్తి వివేక్ (20) అనే విద్యార్థి హైదరాబాద్‌లోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో ఫస్టియర్ చదువుతున్నాడు. ఫస్ట్ సెమిస్టర్‌లో మూడు సబ్జెక్ట్‌లు ఫెయిల్ కావడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లోని బాత్రూంలో కత్తితో మెడ మీద, ఎడమ చేతిపై గాయం చేసుకోవడంతో తీవ్ర రక్తస్రావం జరిగి మృతిచెందాడు. వివేక్ తండ్రి ఉపేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ ఎం.అనిల్‌రెడ్డి తెలిపారు.

వ్యవసాయాధికారుల ఫోన్ నంబర్లు మార్పు

మిర్యాలగూడ, మే 14: మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని మండల వ్యవసాయాధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకుల ఫోన్ నంబర్లు మారినట్లు మిర్యాలగూడ మండల వ్యవసాయాధికారి సైదానాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మిర్యాలగూడ సహాయ సంచాలకుడు 8977751358, మిర్యాలగూడ ఏఓ 8977751368, అడవిదేవులపల్లి ఏఓ 8977751366, దామరచర్ల ఏఓ 8977751366, మాడ్గులపల్లి ఏఓ 8977751367, వేములపల్లి ఏఓ నంబర్ 8977751369. రైతులు పాత నంబర్ల స్థానంలో కొత్త వాటిని నోట్ చేసుకొని అవసరమైన సందర్భాల్లో సంప్రదించాలని సూచించారు.